# రైతుల (వ్యవసాయ ఉత్పత్తికి గిట్టుబాటు ధర హక్కుగా అందడం) బిల్లు, 2017

**రైతులు పండించే పంటలకు న్యాయమైన గిట్టుబాటు ధరలు హక్కుగా లభించేలా చట్టం రూపొందించేందుకు ఉద్దేశించిన బిల్లు ఇది. నవంబర్ 20న ఢిల్లీలో జరిగిన "కిసాన్ సంసద్" లో ప్రవేశ పెట్టిన బిల్లులివి. ఈ బిల్లులపై దేశ వ్యాపితంగా రైతులతో, వ్యవసాయ రంగ నిపుణులతో, పౌరసమాజంతో చర్చజరిపిన తర్వాత ఈ బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని AIKSCC నిర్ణయించింది. ఈ బిల్లులో ముఖ్యమైన అంశాలు క్రింది విధంగా ఉన్నాయి.**

**చాప్టర్1: నిర్వచనాలు**

**1. 'వ్యవసాయం' అంటే:** ఉద్యానపంటలు, ఔషధ మొక్కలను పెంచడం, పంటలు, అంతరపంటలు, పండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తి, చిన్న అటవీ ఉత్పత్తుల సేకరణ, పూలు, గడ్డి, మేతగడ్డి, చెట్లు, భూమిలో పండించే యితర ఉత్పత్తులు, నర్సరీ నిర్వహణ, పశువులపోషణ, చేపలు, తేనెటీగలు, పట్టుపురుగులు, కోళ్ళు, బాతులు, పశువులు, పందుల పెంపకం మరియు భూమిని వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు, యితర వ్యవసాయ అవసరాలకు వినియోగించడం.

**2. 'రైతు' అంటే:** ఒక వ్యక్తి పంటల ఉత్పత్తికి సంబంధించి ఆర్థిక, జీవనోపాధి కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనడం లేదా ప్రాథమిక వ్యవసాయ ఉత్పత్తులను తయారు చేయడం, స్వంత భూమి ఉన్నా, స్వంత భూమి లేకపోయినా వ్యవసాయ వృత్తిలో పాల్గొనే వారందరూ (సాగుదారులు, వ్యవసాయ కూలీలు, పంట భాగస్వామ్య ఒప్పంద రైతులు, కౌలు రైతులు, కోళ్ళు, పశువుల పెంపకం దారులు, మత్స్యకారులు, తేనెటీగల పెంపకందారులు, పశు కాపరులు, తోటలలో పనిచేసే కార్మికులు, అటవీ ఉత్పత్తులను సేకరించేవారు, భూమిని కౌలుకు తీసుకుని గానీ, ఉమ్మడిగా గానీ సాగు చేసే స్వయం సహాయక బృందాలు.

**3. 'కమీషన్' అంటే:** వ్యవసాయ ఖర్చుల, ధరల కమీషన్. యిది రైతుల ఉత్పత్తి ఖర్చులను లెక్కవేయడం, ధరలను నిర్ణయించడం లక్ష్యంగా పనిచేయాలి. దీనిని 11 మంది సభ్యులకు విస్తరించాలి. దీనిని ప్రాంతాలు, రంగాలు, మహిళలకు కూడా ప్రాతినిధ్యం కల్పిస్తూ (అందరికీ సమాన భాగస్వామ్యంతో) ఏర్పరచాలి.

**4. 'రాష్ట్ర కమీషన్' అంటే:** రాష్ట్ర స్థాయి వ్యవసాయ ఖర్చుల, ధరల కమీషన్. దేశంలోని అన్ని రాష్ట్రాలలో వీటిని ఏర్పరచాలి. జాతీయ స్థాయిలో కేంద్రప్రభుత్వం ప్రకటించిన చట్టబద్ధ గిట్టుబాటు ధరకంటే (ARP) ఆయారాష్ట్రాల ప్రత్యేక పరిస్థితులను బట్టి అదనపు ధర రైతులకు లభించేలా చూసేందుకు ఆయా రాష్ట్ర ఖర్చుల, ధరల కమీషన్లు స్వతంత్రంగా వ్యవహరించాలి. అలాగే రాష్ట్రంలో ఈ చట్టం సక్రమంగా అమలయ్యేలా చూడాలి.

**చాప్టర్-2: రైతులందరికీ చట్టబద్ధ హక్కుగా వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర గ్యారంటీ చేయడం.**

1. రైతులందరికీ చట్టబద్ధహక్కుగా వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర గ్యారంటీ చేయడం.

2. వ్యవసాయ ఖర్చుల, ధరల కమీషన్ ఆధ్వర్యంలో రైతులు పండించే ఉత్పత్తులకు (సీజనల్ పంటలు, తోటలు, కూరగాయలు, పండ్లు, కలపేతర అటవీ ఉత్పత్తులు సహా) చట్టం సూచించినట్లుగా ఉత్పత్తి ఖర్చులను లెక్కవేయాలి.

3. యిప్పటి వరకూ ఏ ఉత్పత్తులకయితే, ఖర్చులను లెక్కించేందుకు ప్రాతిపదిక సూత్రాలు లేవో, వాటికి ఆ సూత్రాలను అభివృద్ధి చేయాలి. ఆ ప్రాతిపదికన రైతులనుండి ఉత్పత్తి ఖర్చుల వివరాలు నిర్దిష్ట సమయాలలో సేకరించాలి.

4. ఖర్చుల వివరాలు సమగ్రంగా సేకరించాలి. రైతులు చెల్లించినవి, కొనుగోలు చేసిన ఖర్చులతో పాటు, కుటుంబ సభ్యుల శ్రమ వివరాలు, నిపుణ కార్మికుల శ్రమ వివరాలు, యాజమాన్య ఖర్చులు తదితరాలు కూడా కలపాలి. లోటుపాట్లను ఎప్పటికప్పుడు సరిదిద్దాలి.

5. అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు, సమగ్రంగా సేకరించిన ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం లాభం కలిపి గిట్టుబాటుధరను CACP సిఫారసు చేయాలి.

6. ఈ ధరలను ప్రతి సంవత్సరం ఖరీఫ్ కోసం మార్చి 31 నాటికి, రబీ సీజన్ కోసం ఆగస్టు 31 నాటికి ప్రకటించాలి.

**చాప్టర్-3: కేంద్రస్థాయిలో వ్యవసాయ ఖర్చుల, ధరల కమీషన్**

1) ప్రస్తుతమున్న CACP ని 11 మంది కి (ఛైర్మన్‌తో సహా) విస్తరించాలి. CACP ఛైర్మన్ వ్యవసాయ ఆర్థిక వేత్త అయివుండాలి.

2) ఈ క్రింది వారు సభ్యులుగా వుండాలి.

ఎ) అధికారిక సభ్యులు- వ్యవసాయం, సహకార, రైతు సంక్షేమ శాఖ-1

బి) రైతుల ప్రతినిధులు - 5 గురు

సి) యితర వ్యవసాయ రంగ నిపుణులు- ముగ్గురు

డి) మెంబర్ సెక్రటరీ- ఒకరు

3) ప్రాంతాలు, రంగాలు, జెండర్ పరంగా సమాన ప్రాతినిధ్యం కమిటీ లో వుండాలి.

4) CACP నిర్వహణలో పారదర్శకత తేవాలి. సంస్థను CACP లోని వ్యక్తులు తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకునే పరిస్థితులను నివారించాలి.

5) CACP అధికారాలు:

- సమగ్ర ఉత్పత్తి ఖర్చులపై, 50 శాతం లాభం వచ్చేలా చూస్తూ గిట్టుబాటు ధరను గ్యారంటీ చేస్తూ సిఫారసు చేయడం.
- రైతులకు గిట్టుబాటు ధరలు, స్థిరమైన ధరలు లభించే వాతావరణం ఏర్పరచడానికి, మార్కెటింగ్ రంగంలో మౌళిక వసతుల కల్పన, విధానాలు అభివృద్ధి చేయడానికి సిఫారసులు చేయడం.
- పంటల ఎగుమతి దిగుమతి విధానాలు రైతులకు న్యాయమైన గిట్టుబాటు ధరలు అందకుండా చేసే సందర్భాలను నివారించడానికి CACP ఛైర్మన్ తో కలిసి సంస్థాగతంగా నిపుణులు పనిచేయాలి. తమ సిఫారసులను వాణిజ్య మంత్రిత్వశాఖకు అందిస్తుండాలి.

**చాప్టర్- 4: రాష్ట్రస్థాయి వ్యవసాయ ఖర్చుల ధరల కమీషన్**

1. కేంద్రస్థాయి CACP లానే, రాష్ట్రస్థాయి CACP ఏర్పడుతుంది.
2. మిగిలిన విధివిధానాలన్నీ ఒకే రకంగా వుంటాయి.

**చాప్టర్-5: గిట్టుబాటు ధర గ్యారంటీ చేసి అమలు చేసే పద్ధతి**

1. అన్ని వ్యవసాయ మార్కెట్లలో (వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ మార్కెట్లతో సహా) ప్రతి పంటకు కొనుగోలు ధర నిర్ణయించే వేలంపాట ప్రారంభించినప్పుడు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన 'గిట్టుబాటు ధర'ను కనీస ధరగా తీసుకోవాలి. ఎట్టిపరిస్థితులలోనూ దీనికంటే తక్కువ ధరకు కొనకూడదు.
2. ఏ కొనుగోలు దారుడైనా (కాంట్రాక్ట్ వ్యవసాయం చేయించుకునే సందర్భంలో కూడా) కేంద్రం ప్రకటించే గిట్టు బాటు ధర కంటే తక్కువకు కొనుగోలు చేయడం చట్టరిత్యా నేరం. దీనిపై విచారణకు గురవుతారు.
3. ప్రభుత్వాలు తమ ఆహార భద్రతా పథకాల కోసం పంటల సేకరణ లక్ష్యంగా విస్తృతంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.
4. తగిన స్థాయిలో 'ధరల స్థిరీకరణ నిధి' కోసం బడ్జెట్లను అందుబాటులో వుంచి, సకాలంలో మార్కెట్‌లో జోక్యం చేసుకునేలా ప్రభుత్వాలు సిద్ధంగా వుండాలి.
5. రైతులు తక్కువ ధరలకు తమ ఉత్పత్తులను అమ్ముకునే పరిస్థితులను ప్రభుత్వాలు నివారించాలి. అన్ని పంటలకు తగిన నిల్వ కేంద్రాలను భారీ స్థాయిలో ఏర్పరచాలి. వీటి ఆధారంగా రైతులు దాచుకున్న ఉత్పత్తుల విలువలో 75 శాతం రైతులకు వెంటనే అందించేందుకు ప్రభుత్వాలు ఏర్పాట్లు చేయాలి.
6. రైతులను ఉత్పత్తి దారుల సంఘాలుగా ఏర్పరచేందుకు ప్రభుత్వాలు పెట్టుబడులు పెట్టాలి. ఆయా సంఘాలకు అవసరమైన మౌళిక వసతులను, నిర్వహణ పెట్టుబడిని సమకూర్చాలి. వారు తమ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి, విలువ జోడించి అమ్ముకునేలా సహకరించాలి.
7. నియంత్రణ పద్ధతుల ద్వారా వ్యవసాయ ఉపకరణాల ధరలను నియంత్రించాలి. తద్వారా పంటల ఉత్పత్తి ఖర్చులను తగ్గించేలా చర్యలు చేపట్టాలి.

**చాప్టర్-6: ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం మరియు పరిహారం**

1. జిల్లా స్థాయిలో ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ, ఫిర్యాదులను స్వీకరించే, పరిష్కరించే బాధ్యతను చేపట్టాలి. అలాగే జిల్లాలో ఆయా మార్కెట్లలో పంటల ధరలను పర్యవేక్షించాలి. ఈ కమిటీలో రైతుల ప్రతినిధి ఒకరు, మార్కెటింగ్ శాఖ నుండి ఒకరు, వ్యవసాయ శాఖ నుండి ఒకరు ప్రాతినిధ్యం వహించాలి.

2. ఎవరైనా రైతుకు ప్రకటించిన ధర కంటే తక్కువ లభించినట్లయితే ఏ మేరకు తక్కువ లభించిందో, అంతమొత్తం ఆ రైతుకు నేరుగా పరిహారంగా అందాలి.

3. జిల్లా స్థాయిలో ఏర్పడే కమిటీ, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఆ రైతు పరిహారానికి అర్హులని తేల్చినట్లయితే, నిర్ధేశిత కాల పరిమితి లోపు ఆ మొత్తాన్ని చెల్లించాలి.

4. ఏదైనా మార్కెట్‌లో రైతులకు అందిన సగటు ధర, నిర్ణయించిన ధరకంటే తక్కువ వున్నట్లయితే, ఆ మార్కెట్‌లో ఆ పంటను అమ్మిన అర్హులైన రైతులందరికీ ఆ ధర అందేటట్లుగా చూడాలి.

5. రైతుకు జిల్లా స్థాయిలో పరిహారం లభించనట్లయితే, ఆ రైతు రాష్ట్ర స్థాయి కమీషన్ ముందు తన ఫిర్యాదును దాఖలు చేయవచ్చు.

**చాప్టర్-6: నేరాలు- శిక్షలు**

1. ఎవరైనా వ్యాపారస్థుడు, నిర్ణయించిన ధరకంటే తక్కువకు కొనుగోలు చేసినట్లు రుజువైతే, 1 లక్ష రూపాయల జరిమానా విధించాలి.

2. రెండవసారి, అదే నేరానికి పాల్పడితే, 2 లక్షల రూపాయల జరిమానా విధించాలి.

3. మూడవసారి కూడా అదే నేరానికి పాల్పడితే, 2 లక్షల రూపాయల జరిమానా విధించడంతో పాటు, అతని వ్యాపార లైసెన్సును రద్దు చేయాలి.

4. తగినంత సంఖ్యలో పంటల సేకరణ కేంద్రాలు ప్రభుత్వం తెరవనట్లయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో వ్యవసాయ మార్కెటింగ్ కు సంబంధించి ఉన్నతాధికారికి 50,000 రూ॥ల జరిమానా విధించాలి.

**చాప్టర్-7: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలు:**

1. అన్ని పంటల ఉత్పత్తి ఖర్చులను సమగ్రంగా లెక్కవేయడానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చాలి.

2. CACP నుండి సిఫారసులు అందిన వెంటనే, కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరలను ప్రకటించాలి. ఆ తర్వాత కేంద్రం ప్రకటించిన ధరలకు అదనంగా, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు బోనస్ ప్రకటించాలి.

3. చాప్టర్ 4 లోని నిబంధనలను అమలు చేయడానికి, వ్యవసాయ మార్కెట్లలో అమ్మకపు ధరలను పర్యవేక్షించడానికి తగిన ఏర్పాట్లు చేయాలి. ఒక వేళ ఆ నిబంధనలు అమలు కానట్లయితే చాప్టర్ 5, చాప్టర్ 6 ప్రకారం నిర్దిష్ట కాల పరిమితి లో చర్యలు చేపట్టడానికి ఏర్పాట్లు చేయాలి.

4. కేంద్ర ప్రభుత్వం 50,000 కోట్లతో 'గిట్టు బాటు ధరల' నిధిని ఏర్పరచాలి. అంతేగాక అహార పథకాల కోసం పంటల సేకరణ చేయడానికి, ఆయా సంస్థలను, తగిన నిధులతో సంసిద్ధం చేయాలి. రైతులకు తక్కువ ధరలు అందిన సందర్భంలో, నేరుగా నగదు బదిలీ చేయడానికి జిల్లా కమిటీలు సిఫారసు చేసినపుడు ఈ నిధిని ఉపయోగించాలి. (రిపోర్టు అందిన ఒక నెలలోపు చెల్లింపు జరిగేలా)

5. రాష్ట్ర ప్రభుత్వాలు, తమ రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా బోనస్ చెల్లించేందుకు వీలుగా తమ బడ్జెట్లలో నిధులు కేటాయించాలి.

*అఖిల భారత రైతు ఉద్యమ సమన్వయ కమిటీ (AIKSCC)- తెలంగాణ రాష్ట్రం*

*తేదీ: 21-12-2017*